క్లుప్తంగా

పన్ను చెల్లింపు

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన పీవీఆర్ గ్రూప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పురపాలక సంఘానికి రూ.9,47,309 పన్ను చెల్లించారు. ఈ సందర్భంగా గ్రూప్ డైరెక్టర్ జనార్ధన్‌రావు పవార్ మాట్లాడుతూ.. ఏటా లాగే స్థిరాస్తి, నీటి పన్నును ముందస్తు రాయితీతో చెల్లించామన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న ఎస్ఐ, ఏఎస్ఐలు

నాగలాపురం: మండల కేంద్రంలో పోలీసులు గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సునీల్ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు తాగు నీరు అందించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భాష్యకారుల ఉత్సవం



ఊరేగింపులో ఉత్సవమూర్తి

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాష్యకారుల ఉత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం ఉత్సవమూర్తి మాడవీధుల్లో విహరించారు. ఆలయంలో పది రోజుల పాటు జరిగే ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు సాయంత్రం భాష్యకారుల ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు.

ట్రస్ట్ పేరుతో దోపిడీ

నారాయణవనం: మండల కేంద్రంలో సొరకాయులస్వామి ఆలయంలో అనాధికారిక ట్రస్టును నిర్వహిస్తూ రూ.లక్షల రూపాయలను దోచుకుంటున్నారని జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ ఆరోపించారు. భక్తుల నుంచి కానుకలుగా రూ.లక్షలు గడిస్తూ నిర్మిస్తున్న కట్టడాలకు ఆస్తి పన్నులను ఎందుకు వసూలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. సేవా ముసుగులో స్వీయార్జితానికే ప్రాధాన్యం ఇస్తూ భక్తుల నుంచి దోచుకుంటున్నారని ఆరోపించారు. కమిటీని కాదని కొందరు అనధికారికంగా కమిటీని ఏర్పాటు చేసుకుని పెత్తనం చెలాయిస్తున్నారని ఆయన విమర్శించారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా మణి

శ్రీకాళహస్తి: ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా సివిల్ సర్జన్ (ఓపీ) డాక్టర్ మణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి స్థానంలో డాక్టర్ మణిని నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనస్థీషియన్ డాక్టర్ మురళీరెడ్డి సీనియర్ అయినప్పటికీ ఆయనకు అవకాశం కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

డిప్యూటీ సీఎంకు సాదర స్వాగతం



విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): నెల్లూరు పర్యటన ముగించుకుని రోడ్డు మార్గాన రేణిగుంట విమానాశ్రయానికి గురువారం సాయంత్రం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. ఆయనకు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక విమానంలో విశాఖ పట్నంకు బయలుదేరిన వారికి అధికారులు సాదరంగా వీడ్కోలు పలికారు. విమానాశ్రయంలో జిల్లా జనసేన పార్టీ నాయకులు డిప్యూటీ సీఎంను కలిశారు.

లాభాల పూదోట

- సత్యవేడు నియోజకవర్గంలో పూలసాగుపై ఆసక్తి
- అన్నదాతకు ఆర్థిక భరోసానిస్తున్న వైనం
- సత్యవేడు పూలకు మంచి గిరాకీ
- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

పూలతోటల సాగు రైతులకు ఆర్థిక దన్నుగా నిలుస్తున్నాయి. ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు నియోజకవర్గంలో పూలసాగుకు రైతులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇక్కడి పూలకు చెన్నై, కోయంబేడు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో రైతులు ఉత్సాహంగా సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రైతులు ఉమ్మడిగా ఏర్పాటు చేసుకునే వాహనాల ద్వారా చెన్నైకి పూలను తరలించి సొమ్ము చేసుకుంటారు. అంతేకాక కొందరు రైతులు స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో పూల సాగు అన్నదాతకు ఆర్థిక పరిమళమవుతోంది.



పిచ్చాటూరు వద్ద సాగు చేస్తున్న మల్లెపూల తోట

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో పూలసాగు ఏటా పెరుగుతోంది. పూలసాగుకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రాబడి ఆశించిన స్థాయిలో ఉండడంతో ఆ సాగును నమ్ముకున్న రైతుల కుటుంబాల్లో ఆర్థిక పరిమళం వెదజల్లుతోంది. సత్యవేడు నియోజకవర్గం అంటేనే పరిశ్రమలతో పాటు పూల వ్యాపారం ఇక్కడి ప్రజలకు సుపరిచితమే. నియోజకవర్గంలో నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం, సత్యవేడు, నారాయణవనం మండలాల్లో అధికంగా వ్యవసాయంతో పాటు పూల సాగు చేసి వారి కుటుంబాల్లో ఆర్థిక సిరులు పెంచుకుంటున్నారు. ఇందులో భాగంగా అన్నిరకాల పూల సాగుకు రైతులు సిద్ధపడుతున్నారు. సకాలంలో పూలతోటలను సాగు చేసి పంటను చేజిక్కించుకోవడంలో రైతులు పక్కా వ్యూహంతో ముందుకెళ్తున్నారు.



నాగలాపురం వద్ద సాగు చేస్తున్న రోజా పూలు

పెట్టుబడి తక్కువ..

ప్రధానంగా పూలతోటల సాగులో అనేక రకాలు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతంలో భూ పరిస్థితులకు అనుగుణంగా మల్లెలు, పన్నీరు రోజా, బంతి, కాకడ, సంపంగి తోటలు సాగు చేస్తున్నప్పటికీ మల్లెలు, పన్నీరు రోజా, సంపంగి, చామంతి పూలసాగుకు రైతులు మక్కువ చూపుతుంటారు. బంతి, కాకడ, మల్లెపూలను 10 సెంట్ల విస్తీర్ణంలో రూ. 6 నుంచి రూ.10 వేలు, పన్నీరు రోజా, సంపంగి తోటలకు రూ.10 నుంచి రూ.16 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. పెట్టుబడి ఖర్చులు పోగా రూ.40 వేల నుంచి రూ.60 వేలకు పైగానే లాభాలు ఆశిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

అందుబాటులో మల్లెలు

మల్లెపూలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. ఈ రకం పూలు సాగులో రైతులకు శ్రమ తక్కువే అయినప్పటికీ ఆదాయం బాగానే ఉందనే చెప్పుకోవాలి. ఒకసారి మల్లె తోటలు సాగు చేస్తే నిత్యం మల్లెపూలు ఆ తోటలో అందుబాటులో ఉంటాయి. మల్లెపూలకు సీజన్‌తో పనిలేకుండా రైతులు పండించి మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఒక్కో సీజన్‌లో అయితే మల్లెపూలు పండించే రైతులు మంచి లాభాలు పొందుతున్నారంటే అతిశయోక్తి కాదు. అందుకే ఈ రకం పూలసాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

సత్యవేడు టూ కోయంబేడు

రైతులు సాగుచేసిన పూలను అధికంగా చెన్నై, కోయంబేడు మార్కెట్‌కు తరలిస్తుంటారు. నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, సత్యవేడు మండలాల రైతులు ప్రతి పంటను కోయంబేడుకు తరలించి విక్రయిస్తుంటే కేవీబీపురంలోని రైతులు మాత్రం స్వయంగా శ్రీకాళహస్తి, పుత్తూరు, రేణిగుంట పట్టణాలకు తీసుకెళ్లి ఇంటింటికి తిరుగుతూ విక్రయించి అధిక ఆదాయాన్ని పొందుతున్నారు. ఇక్కడ పూలకు కోయంబేడు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో రైతులు పూలతోటల సాగుపై మక్కువ చూపుతున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో పూదోటల సాగు వివరాలు:

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
వరదయ్యపాళెం	50	40
పిచ్చాటూరు	500	800
నాగలాపురం	180	200
బీఎన్‌కండ్రిగ	50	90
నారాయణవనం	110	126
కేవీబీపురం	120	160

నోటీస్ బోర్డు

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి లత తెలిపారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం



ప్లాంటును ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామ పంచాయతీ పరిధిలోని పచ్చాలమ్మ కాలనీలో గురువారం ఇండాస్ కాఫీ పరిశ్రమ వారు ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను కంపెనీ డైరెక్టర్ హరేంద్రనాథ్, ఏజీఎం రమేష్ ప్రారంభించారు. రూ. 10 లక్షలతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, సుధాకర్‌నాయుడు, కన్నయ్య, మధు పాల్గొన్నారు.

దళిత యువకుడి సాంఘిక బహిష్కరణపై చర్యలేవీ?



చిన్నా, జిల్లా అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ

వరదయ్యపాళెం: సాక్షాత్తు ఆంధ్ర రాష్ట్రానికే ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో దళితులకు శాంతి భద్రతలు కరువయ్యాయని, ఏకంగా ఓ దళిత యువకుడి కుటుంబాన్ని ఊరంతా బహిష్కరిస్తే ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి చిన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దళితులకు భద్రత కరువైందని ఆరోపించారు. పిఠాపురం నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో ఓ చిన్న కారణానికి దళితుడైన సురేష్ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణకు గురి చేసిన ఘటన కేవలం కూటమి ప్రభుత్వం అండదండలతోనే జరిగిందని, ఈ చర్యలను పూర్తిగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా దళితులు ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన హెచ్చరించారు.

ఆరు నెలలుగా తిరుగుతున్నా కరుణించలేదు



సుమతి, బత్తలవల్లం

వరదయ్యపాళెం: పట్టాభూమిలోని 21 సెంట్ల పొలాన్ని అదే గ్రామానికి చెందిన మరొకరిపై రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో మార్చివేశారు. ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైన పట్టాభూమిని తన పేరిట మార్చాలని ఓ మహిళ 6 నెలలుగా రెవెన్యూ కార్యాలయానికి తిరుగుతున్నా పట్టించుకొనేవారే కరువయ్యారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. నా పేరు సుమతి.. మాది బత్తలవల్లం గ్రామం. నాకున్న 21 సెంట్ల సెటిల్‌మెంట్ పట్టాభూమి మా గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో మార్చివేశారు. తిరిగి ఆ భూమిని నా పేరిట మార్చుకునేందుకు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తు చేసుకుని 6 నెలలు అవుతున్నా తన పేరిట భూమి మారలేదు. స్థానిక వీఆర్వో మాత్రం నా పరిధిలో పని పూర్తి చేశానని, తహసీల్దార్ పరిధిలో తంబ్ పెడితే నీ పేరిట మారుతుందని వీఆర్వో చెబుతున్నారు. అయితే ఇటీవల కాలంలో తహసీల్దార్ సత్యవేడు మండలానికి ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవడంతో వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయానికి ఆయన రావడం లేదు. దీంతో తమ మ్యుటేషన్ పని అలానే ఆగిపోయింది. ఇలా 6 నెలలుగా తిరుగుతున్నా తనపై రెవెన్యూ అధికారులు కరుణ చూపలేదని ఆమె వాపోయారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: మండలంలోని ఎగువ వీధికి చెందిన దామోదర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం ఆస్పత్రికి చేరుకుని దామోదర్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన కొండమీట్ట మాజీ కౌన్సిలర్ బొద్దులూరు ధర్మయ్య తమ్ముడు బొద్దులూరు గోపికృష్ణ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, అంజూరు తారక శ్రీనివాసులు గురువారం అక్కడికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మురళీ యాదవ్, సాధన మున్న రాయల్, ఉత్తరాజి శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు శ్రీవారి సురేష్, పగడాల రాజు, పటాన్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం పెంకులపాడు గ్రామంలో మద్దు రమేష్ యాదవ్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

26 నుంచి మహా కుంభాభిషేక ఉత్సవాలు



ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏర్పేడు (రేణిగుంట): ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీహయగ్రీవ స్వామి దేవస్థాన మహా కుంభాభిషేక ఉత్సవాలు 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గిరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వన్నె కుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గిరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల పాటు మహాసంకల్పంతో అందరి సహకారంతో ఆలయాన్ని నిర్మించామన్నారు. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే మహా కుంభాభిషేకం మహోత్సవంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, చిన్న మునిరెడ్డి, ఏకాంబర రెడ్డి, బలరామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, కేశవులు, సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై నిర్లక్ష్యం



రేణిగుంట పంచాయతీ కార్యాలయం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మేజర్ పంచాయతీ లోని 120 మంది పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన నిత్యావసర సరుకులు, యూనిఫామ్ నెలలు గడుస్తున్నా అందజేయకపోవడంపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేణిగుంట పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్క రికి రెండు జతలు యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె, టవల్స్, బూట్లు, చేతి గ్లౌజులు, మాస్కులు పంపిణీ చేస్తారు. కానీ 2024 ఆగస్టు నెలలో ఇవ్వాల్సిన వస్తువులు 2025 ఏప్రిల్ నెల గడుస్తున్నా ఇంత వరకు ఇవ్వకపోవడంపై పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురుగు కాలువల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. రెండు నెలల క్రితం యూనిఫామ్‌లు, సబ్బులు వంటి, వస్తువులు కొనుగోలు చేసి పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచారని, కానీ ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

బడి కోసం ధర్నా



ఇన్‌చార్జి డిప్యూటీ ఈఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న తల్లిదండ్రులు

నారాయణవనం: పాఠశాల విలీనాన్ని నిరసిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం ఇప్పన్‌తాంగాళ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లులు నిరసన తెలిపిన సంఘటన గురువారం మండల వనరుల కేంద్రం వద్ద చోటు చేసుకుంది. విలీనం పేరుతో కూటమి ప్రభుత్వం దళితుల పిల్లలను చదువులకు దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విలీనం పేరుతో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చేసిందని అన్నారు. దీంతో 3,4,5 తరగతులు చదవాలంటే 3 కిలోమీటర్ల దూరంలోని భీమునిచెరువు, బ్రాహ్మణతాంగాళ్ పాఠశాలలకు పిల్లలు నడిచి వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విలీనాన్ని ఆపివేయాలంటూ నినాదాలు చేసి నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి పుత్తూరు డిప్యూటీ ఈఓ, నారాయణవనం ఎంఈవో ప్రభాకర్ రాజుకు వినతి పత్రాన్ని అందజేశారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుధాకర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులు నేపథ్యంలో రేణిగుంట మండలంలోని విన్నారీ ఫ్యాక్టరీ సర్కిల్ లో అర్బన్ సీఐ శరత్ చంద్ర, ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి, యోగానంద కాలేజ్ సర్కిల్‌లో గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ తమ సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వాహనాల తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రోత్సాహం



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చాటిన ఇద్దరు విద్యార్థినులకు విశ్రాంత ఎస్పీ రమేష్‌నాయుడు నగదు ప్రోత్సాహం అందజేశారు. మండల టాపర్‌గా నిలిచిన కీర్తి (981)కి రూ.10 వేలు, రెండో స్థానం సాధించిన సుష్మ (977)కు రూ.5 వేలు నగదు ప్రోత్సాహాన్ని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం చేతుల మీదుగా అందించారు. – బుచ్చినాయుడుకండ్రిగ



రేణిగుంట బాలికల పాఠశాల ఎదురుగా రోడ్డుపై బోరు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

సర్వీసు రోడ్డులో బోరు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రోడ్డులో గురువారం ఉదయం పంచాయతీ అధికారులు తాగునీటి బోరు వేశారు. సీఆర్ఎస్, రేణిగుంట పంచాయతీలోని పారిశ్రామికవాడకు ఇదే సర్వీస్ రోడ్డులో అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో పాటు బాలికల ఉన్నత పాఠశాల గేటు ఎదురుగా బోరు వేయడంపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వినాయకనగర్ కాలనీలో ఎక్కడా స్థలం లేనట్లు ఆ కాలనీ వాసుల కోసం సర్వీసురోడ్డులో బోరు వేయడం ఏమిటని పలువురు కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు 480 అడుగులు బోరు వేసినా నీళ్లు పడకపోవడంతో చేసేదేం లేక బోరు నిలుపుదల చేశారు. రోడ్డులో నీళ్లు పడతాయని పాయింట్ పెట్టిన అధికారుల తప్పిదం వల్ల సుమారు రూ.1.2 లక్షల ప్రజాధనం వృథా అయ్యింది. దీంతో పాటు నడిరోడ్డులో కేసింగ్ పైపులు దిష్టిబొమ్మలాగా దర్శనమిస్తున్నాయి.

కైలాసగిరిలో చెలరేగిన మంటలు



కైలాసగిరుల్లో మండుతున్న మంటలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయానికి అనుబంధమైన నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద కైలాసగిరి పర్వతాల్లో గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. గతంలో ఈ మంటలో భరద్వాజతీర్థంలోని గోశాల వద్ద వరకు వచ్చిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ప్రత్యేకమైన చర్యలు చేపట్టి ఈ మంటలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేసవిలో తరచూ కైలాసగిరిలో మంటలు చెలరేగుతున్నాయి. ఈ మంటల నివారణ కోసం కైలాసగిరి కొండల్లో అక్కడక్కడా తుంపర సేద్య పరికరాలు ఏర్పాటు చేసి నివారించవచ్చు. అయితే మంటలు వ్యాపించినప్పుడు హడావుడి చేసే అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. దీనిపైన అధికారులు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి పిరికి చర్య





శ్రీకాళహస్తి : కొవ్వొత్తుల ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నేతలు, వరదయ్యపాళెం: కొవొత్తులతో ర్యాలీలో వివిధ రాజకీయ పార్టీ నేతలు

శ్రీకాళహస్తి: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ నేతలు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఖండించాలని మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ఏపీ సీట్ సర్కిల్ వద్ద కశ్మీర్లో ఉగ్రవాదాన్ని నిరసిస్తూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవారి సురేష్, పటాన్ ఫరీద్, సాధనమున్న రాయల్, కంటా ఉదయ్ కుమార్, షేక్ రాజు బాషా, ఉత్తరాది శరవణ కుమార్, కొత్త పార్టీ శ్రీనివాస్ రెడ్డి, కొల్లూరు హరినాథ్ నాయుడు, డాక్టర్ శంకర్, నారాయణ, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతను దెబ్బతీసే కుట్ర

వరదయ్యపాళెం: ఉగ్రవాదుల దాడి.. పిరికి చర్య అని, దాడులతో దేశ సమగ్రతను ఎవరూ భగ్నం చేయలేరని పలు రాజకీయ పార్టీ నాయకులు అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ గురువారం సాయంత్రం వరదయ్యపాళెం పురవీధుల్లో బీజేపీ, జనసేన, సీపీఐ నాయకులు కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గుత్తి త్యాగరాజు, చిన్నిరాజ్, తడ శ్రీనివాసులు, రవిరెడ్డి, సాగర్, ఢిల్లీ రాయల్, భాస్కర్‌రెడ్డి, సిద్ధయ్య ఉన్నారు.